


నా బాల్య జీవితచరిత్రలో ఒక రసవత్తరఘట్టం. మంచం విరిగి మానాన్నమీద పడ్డరాత్రి నాటి కథ. ఆ కథ అసలు కాగితంమీద వ్రాయటానికన్నా, నోటితో చెప్పడానికే బాగుంటుంది. ఎంచేతంటే- యీ కథలో ఉచిత స్థలాల్లో తలుపులు మూసిన చప్పుడు, వరండాల్లో జోళ్లు విసిరిన శబ్దాలు, కుక్క అరుపులు, మనుష్యులగోల, శ్రవణానందంగా వినిపిస్తేనేకాని, కథలో 'సారాసెంబు' కనపడదు. అయినా తప్పదు కనక, కాగితంమీదే వ్రాయవలసివస్తూంది.

మా మేడలో, చివర ఒకగదిలో, ఊరగాయలు పెట్టుకునే అటకలాంటిది ఒక టుంది. గదిలోంచి దానిమీదకు మెట్లు, పైన మంచం వున్నాయి. ఆ రాత్రి, మానాన్న అటకమీద మంచంమీద పడుకుంటా నన్నాడు. బహుశా యితరుల గొడవ లేకుండా ఆలోచించుకోడానికి కాబోలు. ఆమంచానికి ఒక పక్క రెండుకోళ్లు అవుగ్గా వున్నాయనీ, ఆయన పడుకున్న వెంటనే అది విరిగి ఆయన కిందపడి అది పైనపడితే అపాయమనీ- యీ కారణాలచేత మాఅమ్మ ఒప్పుకోలేదు. ఎవ్వరిమాటా వినలేదు ఆయన. పావుతక్కువ పదింటికి ఆ గది తలుపు వేసిన చప్పుడూ, మెట్లు ఎక్కిన కిర్రు వినిపించాయి. ఆయన మంచంమీదకి చేరుకోగానే కిర కిరలు వినిపించాయి. మామూలుగా ఆ మంచంమీద మా తాతయ్య పడుకునేవాడు. నాలుగురోజుల నుంచీ ఆయన దర్శనం లేదు. (సామాన్యంగా, యింట్లోంచి పారిపోతే, ఏడెనిమిది రోజులదాకా మళ్ళీ యింటికి రాడు. కోపంతో విసుక్కుంటూ, భారతీయులలో ఐక్యం లేదనీ, జనరల్ హేవలక్ నానాసాహేబుని ఓడించటం నిశ్చయమనీ, వార్తలతో వచ్చేవాడు. మా తాతయ్య '1857' స్వాతంత్ర్యసమరంలో యుద్ధం చేశాడు కొంత కాలం.)

ఆరోజుల్లో మమ్మల్ని చూసిపోడానికి, మా పిన తండ్రిగారబ్బాయి-విశ్వంభరు డొచ్చాడు. వాడికి కొంచెం నరాల బలహీనత. నిద్రలోనే ప్రాణం పోతుందని వాడికి భయం. రాత్రి ప్రతిగంట గంటకూ వాణ్ణి లేపకపోతే, వూపిరితిరక్క చస్తానని వాడి కదో వెర్రిభయం. గంటగంటకూ కొట్టేలా అలారం గడియారం సర్ది, మంచంపక్కన పెట్టుకోడం అలవాటు. అయినా మాయింటి కొచ్చాక, అది మానిపించ కలిగేను. మే మిద్దరం ఒకగదిలోనే పడుకుంటున్నాం. ఎవరేనా వూపిరి పీల్చడం మానేసినా తెలివివచ్చేంత తేలిక నిద్రగాణ్ణని వాడికి చెప్పేను. మొదటిరాత్రి పరీక్షచేశాడు-చేస్తాడని నే ననుకుంటూనే వున్నాను. నేను నిద్రపోయా ననుకుని, తాను వూపిరి బిగపట్టేడు-నే వెంటనే లేచి పిలిచాను. నామాటలో నమ్మకంకలిగి కాస్త భయం తగ్గింది కాని, 'స్మెల్లింగ్‌సాల్టు' సీసా ఒకటి పక్కలో వుంచుకొనే వాడు. తన వూపిరి ఆగిపోయి, నేను వెంటనే లేవకపోతే, పూర్తిగా ప్రాణంపోయేలోపల, తనే అది వాసనచూచి, మళ్లీ తెలివితెప్పించుకొనేందుకట! అసలు వాళ్ల కుటుంబంలో ఏదోపిచ్చి అందరికీ వున్నట్లే కనపడుతుంది. విశ్వంభరుడితల్లికి, తాను తొండారంలో పుట్టి తొండారంలోనే పెళ్లిచేసుకుంది కనక- తొండారంలో తప్ప యింకెక్కడా చావనని, అదో దిక్కుమాలిన నమ్మకం. విశ్వంభరుడి పింతల్లి

వుంది- రాత్రి దొంగవచ్చి, తలుపు కిందనుంచి, ఏదో గాలి వూది తనకి మత్తెక్కించేసి యిల్లు దోచేస్తాడని తగని భయం. అందుచేత అల్లా జరక్కుండా చెయ్యడానికి, ఇంట్లో వున్న ఖరీదైన వస్తువులన్నీ తన గది బయటే పారేసి, ఒక చీటీ యిల్లా రాసి అక్కడ పెట్టేది. "మాయింట్లో విలువైన వన్నీ యిక్కడే పడేశాను. నా గదిలో ఏమీ లేవు. నీ క్లోరోఫారం గట్రా వూది నన్ను చంపక అవి పుచ్చుకు తగలడు" అని. ఆవిడకు దొంగతనం జరగడంకన్నా క్లోరోఫారం అంటేభయంఎక్కువ. విశ్వంభరుడి అమ్మమ్మ వుంది. ఆవిడకీ దొంగల భయమే. నలభై సంవత్సరాలనుంచి, యింట్లో ప్రవేశించడానికి గజదొంగలు ప్రయత్నంచేస్తున్నారంటుంది. ఇంతవరకూ పూచికపుల్లయినా పోకపోయినాసరే. వాళ్లని హడల కొట్టెయ్యడానికి, ప్రతి రాత్రీ పడుకునే ముందర, మేడమీదనుంచి కింద మెట్లున్న హాల్లోకి చెప్పులు విసిరేస్తూండేది.

వీళ్ళ గొడవలో పడి, అసలుకథనుంచి దాటిపోయాం. రాత్రి పన్నెండుగంటలయేసరికి మేమంతా పడుకున్నాం. తర్వాత జరిగిన విషయాలు అర్థం చేసుకోడానికి, ఏయే గదుల్లో ఎవరెవరు పడుకున్నారో చెప్తాను ముందర. మేడమీద మా నాన్న పడుకున్న అటక వున్నదానికి పక్కగదిలో మా అమ్మా, తమ్ముడు రామం పడుకున్నారు. వాడు తరచు నిద్రలోనే పాడుతూంటాడు. సామాన్యంగా "అప్పనా తనా మనా!" పాటో, లేకపోతే "ఎంకివంటీ పిల్ల లేదోయ్!" అనో పాడుతూంటాడు. ఆగది పక్కనే నేనూ, విశ్వంభరుడూ పడుకున్న గది వుంది. మా అన్నయ్య సత్యం పడుకున్న గది మా వాటి కెదురుగా వుంది. మధ్య హాలులో మా కుక్క 'పులి' పడుకుంది.

నే పడుకున్న మంచం చేసిన మహానుభావుడెవరో కాని- అది రెండున్నర అడుగుల వెడల్పుంది. ఏపక్కకి కాస్త ఒత్తిగిల్లినా కాని, పెద్ద చప్పుడుతో మనల్ని కింద పడేసి అది మీద పడిపోతుంది. దానికి 'బాలన్సు' తక్కువ. తెల్లారుఝామున రెండు గంటలకు సరిగ్గా అదే జరిగింది.

అసలు నాకోపట్టున మెలుకువ రాదు (విశ్వంభరుడితో అబద్ధం ఆడేను లెండి). నేను కప్పుకొన్న రగ్గు నా కిందనున్న పరుపుతోసహా దొర్లిపోడం మూలాన, నాకు దెబ్బ తగలలేదు. పైగా మంచం నామీద గొడుగుపట్టినట్టు పడి వుంది. నాకు తెలివి రాబోయి మానేసింది. కాని యీ చప్పుడుకి మా అమ్మ మేలుకుంది. మంచం విరిగి మా నాన్నమీద పడింది- అని ఆవి డనుకుంది.

"మీనాన్నను తియ్యం దర్రోయ్!" అని ఒక్కటే గావుకేకలు మొదలెట్టింది. నామంచం పడ్డ చప్పుడుకన్నా, ఆవిడ గోలకే తెలివొచ్చింది, ఆవిడ గదిలోనే పడుకొన్న రామంకి. అమ్మకి దయ్యం పట్టిం దనుకున్నాడు వాడు. "ఏం ఫరవా లేదు పడుకోవే అమ్మా!" అని వాడు; "మీనాన్న బతికున్నారో లేదో చూడండోయ్, వాజమ్మల్లారా!" అని ఆవిడా, ఒక ర్నొకరు పట్టుకుని కేకలేసుకుంటున్నారు.

ఆ గోలకు విశ్వంభరుడికి తెలివొచ్చింది. అప్పటికే నాకూ మెలకువ వొచ్చి, ఆ గోల అర్థం అవుతూంది కాని, నేను మంచం కింద వున్నానని గుర్తు రాలేదు. తనకు వూపిరాడటం లేదనీ, అందుకోసమే మేమంతా గోల చేస్తున్నామనీ విశ్వంభరు డనుకొని 'స్మెల్లింగ్ సాల్టు' సీసా తీసుకుని పీల్చటానికిబదులు నెత్తిమీద బోర్లించేసుకున్నాడు. గది అంతా ఘాటెక్కిపోయింది. ఆ ఘాటుకి వాడికి నిజంగా వూపిరి ఆగిపోయేటంత పని అయింది. తడుముకుని ఎల్లాగైతేనేం, మూసివున్న ఒక కిటికీ దగ్గరకు చేరుకుని, అద్దం బద్దలుకొట్టేసి, బయటి చల్లని గాలి ఆనందంగా పీలుస్తున్నాడు. ఆ సమయంకి నేనూ లేద్దామని ప్రయత్నం చేసేదాకా, మంచం నా మీద వుందని తెలియనే లేదు. అప్పుడు తట్టింది నాకు. బహుశా యీ పాడు గోలంతా, నన్ను మంచంకిందనుంచి బయటికి లాగడానికే ఏమోనని. గనిలో కూరుకుపోయిన వాడిలా తోచి, "నన్ను పైకి లాగండి" అని అరిచాను.

అప్పటికి మా అమ్మ అరుస్తూ నాన్న పడుకున్న గది చేరుకుంది. ఆవిడని చెయ్యి పుచ్చుకు లాగుతూ, అరుస్తూ రామం కూడా వచ్చాడు. ఆవిడ ఎంత లాగినా గుంజినా ఆ తలుపూడి రాలేదు. ప్రశ్నలు అడుగుతూ సత్యం, మొరుగుతూ 'పులి' కూడా ఆ సంతలో చేరేరు.

దూరంగా వుండం మూలాన, యింతవరకూ గుర్రుపెట్టి నిద్దరోతున్న మా నాన్న, ఈ హడావుడికి లేచి, యిల్లు అంటుకుందనే నిర్ధారణ

కొచ్చాడు. "నే వస్తున్నా! పిల్లలు జాగ్రత్త, వస్తున్నా!" అని అరుస్తూ లేచాడు. కాని నిద్దరకళ్ళని ఆతను అన్న మాటల్ని అమ్మ యింకోలా అర్థం చేసుకుని, "ఆయన చచ్చిపోతున్నాడర్రా" అని అరిచింది. ఆయన దేవుడి దగ్గర కొస్తున్నానంటున్నాడనుకుంది.

ఆవిడ కేకకు సమాధానంగా విశ్వంభరుడు "ఫరవాలేదు- నా కూపిరి తిరిగింది" అన్నాడు. నే నెల్లా గయితేనేం, లైటు వేసి గది తలుపుతీశాను. మేం యిద్దరం కూడా బయటపడి, నాన్న అటక దగ్గరకు చేరుకున్నాం. మా 'పులి'కి విశ్వంభరుడంటే ఎప్పుడూ గుర్రే. ఈ గోలంతకూ వాడే కారణం అనుకుందో ఏమో, వాడి పిక్క పట్టుకుంది. సత్యం దాన్ని వూడదీసి బలవంతంగా పట్టివుంచాడు.

నేను బలంగా తన్ని తలుపు లూడగొట్టేను. అప్పటికి మానాన్న మంచం మీదనుంచి దిగి, నిద్దర కళ్ళతో మెట్లుదిగి వొస్తున్నాడు. ఆయన్ను చూడ గానే, అమ్మ ఏడుపు మొదలెట్టింది. 'పులి' మోరెత్తి మొయ్యో మనసాగింది.

"ఏమిటర్రా! యీ పాడుగోల! ఒక్కక్షణం ప్రాణం సుఖంగా వుండ నివ్వరు కదా?" అంటున్నాడు నాన్న.

ఈగోలకి తలాతోకా ఓగంటదాకా అర్థమవ లేదు. "ఇంకా నయం; యీగోలకు సాయం మీ తాతయ్యకూడా యిక్కడున్నారు కారు, సరి పోను" అంది మాఅమ్మ.

# పల్లెటూళ్ల అసలుస్థితి

## యమ్మనూరు నాగేశము

పల్లెలు, భారతదేశం నిజానికి రెండూ వేరుకాదు. పల్లెలు పేదరికానికి పుట్టినిళ్లంటే, భారతదేశం కూడా అంతే. దేశం అభ్యుదయమార్గం పట్టాలంటే, పల్లెలు అభివృద్ధికేంద్రాలు కావాలి. భారత పిత బాపూజీ కోరిన దిదే. నిర్మాణ కార్యక్రమంతో 'జీర్ణ గ్రామ పునరుద్ధరణ', 'గ్రామ పరిశ్రమల అభివృద్ధి' మొదలైనవాటిని పేర్కొన్నాడు; వాటిని సాధించడానికి జీవితాంతం ప్రయత్నించాడు. ఆయన అడుగుజాడల్లో నడవాలంటే, మనకు దీనిని మించిన కర్తవ్య ముంటుందా?

తిన తిండి, కట్ట బట్ట, ఉండ నిల్లు- ప్రతివానికీ తప్పనిసరికదా! సరిగాఅవిమాత్రమే పల్లెల్లోలోటు. ఇక 'నీతి- విజ్ఞానం' పల్లెల పొలిమేరలు విడిచి ఎంతకాల మయిందో చరిత్రకారులకుకూడా దురూహం. పల్లెలను ఆర్థికంగా సరిపరచడంతో మన మనుకున్న రీతిగా అవి తయారవునని- ఉపన్యాసాలలోను, పత్రికలలోను- అధికారపూర్వకంగానూ, అనధికారపూర్వకంగానూ- ధృవంగానూ, గాలివార్తగానూ మనకు వినవస్తోంది.

స్వతంత్ర భారతంలో కేంద్రప్రభుత్వం ప్రత్యేకించి పల్లెలకోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు; రాష్ట్రప్రభుత్వాలకి ఆదేశాలిస్తున్నారు. కాని మన రాష్ట్రప్రభుత్వం యిప్పటికి దఫదఫాల కావించిన తీర్మానాలు చూస్తే, అప్పుడే కొన్ని యేళ్ళనుంచీ స్వయంసమృద్ధంగా- స్వయంపోషకంగా ఉంటూన్న పల్లెలలో మనం జీవిస్తూన్నట్టు కనిపిస్తుంది.

కాని పల్లెలలో అడుగుపెడితే మనకు స్వాగత మిచ్చేవి-నిరాశ, నిస్పృహ, నిరుత్సాహము. ఇక తెల్లవారి పెంపకంలో మన కబ్బిన 'సోమరితనము', 'సామ్రాజ్యతత్వము' చిరస్థాయిగానే ఉన్నాయి. ఇది మన పల్లెల సర్వసామాన్య స్థితి.

కొన్నికొన్ని పల్లెలలో యింకో విచిత్రపరిస్థితి కనిపిస్తుంది. నేడు 'తిండి, గుడ్డ' కంటితో చూడ్డానికికూడా కరవైపోయాయి. ఈ కరువు కాంగ్రెసు వారు తెచ్చి పెట్టిందనీ, దీనికి గాంధీజీ కారకుడనీ- ఒక ఘోరమైన ప్రచారం యీ పల్లెటూళ్ళలో సాగుతోంది. తమతమ పనులు నెరవేర్చుకోడం కోసం కొందరు భూస్వాములు యీ ప్రచారానికి దోహదం చేస్తున్నారు. అమాయకులైన పల్లెటూరి ప్రజ దీనిని నమ్ముతున్నారు. వీరికి సహేతుకంగా